


# ప్రియురాలు పిలిచె

– డా.యండమూరి వీరేంద్రనాథ్



## (గత సంచిక తరువాయి)

**''అవుననుకుంటాను...''**

''అనుకుంటానేమిటి? నేను చెప్తే అవునంతే. అన్నట్టు మీరేమిటి గాఢంగా నిశ్వసిస్తున్నారు? బొమ్మేసే ఉత్సాహం పోయిందా?''

అతడు సగం పూర్తయిన బొమ్మవైపు నిర్లిప్తంగా చూసి మౌనంగా ఉండిపోయాడు. ఆమె నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ ''...నేను డాన్స్ చేయనా?'' అంది.

అకస్మాత్తుగా వినిపించిన ఆ మాటలు వెంటనే అర్థంకాక, ''ఏమిటి?'' అన్నాడు అయోమయంగా.

ఆమె ఉత్సాహంగా రాతి మీద నుంచి క్రిందికి దిగి, ''చేతిలో హారతి కర్పూరం వెలిగించుకుని డాన్స్ చేస్తాను. 'వెయ్... బొమ్మెయ్... తకధై... నాలోని ఊపిరి నీవై – ధై – నీ చేతి కుంచె నేనై... వెయ్.. వెయ్.. బొమ్మెయ్' అని పాడతాను. విశ్వనాథ్ చూశారంటే వెంటనే నన్ను హీరోయిన్‌గానూ, ఈ సీను క్లైమాక్స్‌గానూ పెట్టి తీస్తారు.''

''వీటన్నిటికీ తోడు నీకు సినిమా ఉత్సాహం కూడా ఉందా?''

''అచ్చు మా రాజేష్ అడిగినట్టు అడుగుతున్నారు. ఏం? ఉంటే తప్పేమిటమ్మా? రాజేష్ అంటూ ఉంటాడు. 'వేస్తే వేశావుగానీ, రాఘవేంద్రరావుగారి పిక్చరులో వేయకు. నిక్కరేసి నీళ్ళల్లో ముంచుతారు' అంటాడు. నాకు వళ్లు మండుద్ది. విశ్వనాథ్ గారైతే మాత్రం జాకెట్ విప్పి పైట నిండుగా కప్పి ముంచరా' అంటాను. సినిమాల్లో అందరూ ముంచేది నీళ్ళలోనే కదా. అఫ్‌కోర్స్. ఆయనది సెక్స్ అయితే ఈయనది రొమాన్స్ అనుకోండి–''

''రెండింటికీ తేడా ఏమిటో?''

''చదివి మంచం పక్కన పడేసేది సెక్స్. రాత్రి భర్తకి చదివి వినిపించి నవ్వుకునేది రొమాన్సు. అన్నట్టు మిత్రాజీ! ఆంధ్రదేశానికి ఇంతదూరంలో నేను తెలుగు సినిమా సంస్కృతి గురించి, రొమాన్సు గురించి మాట్లాడటం కా...స్త ఎక్కువైందేమో...''

''కా...స్త కాదు! చాలా ఎక్కువైంది.''

ఆమె రాయి మీద కూర్చుంటూ, ''అచ్చు మా రాజేష్ కూడా అలాగే అంటాడు. నేను మాట్లాడకుండా ఉండటానికి ఏకైక మార్గం... మీరు బొమ్మ వేయటం ట్రింగ్...ట్రింగ్'' అంది.

అతడు మరోసారి ఆ చిత్రంవైపు చూసి ''రంగులు కరెక్టుగా లేవు'' అన్నాడు దిగులుగా.

ఆమె కంగారుగా ''అయ్యో. వచ్చిందా ఆ సమస్య? నేను అనుకుంటూనే ఉన్నానుస్మీ. సిమ్లా బజారంతా తిరిగాను. సరి అయిన కేన్వాస్ దొరకలేదు. ఇక 'లిండిల్' అన్న పేరే ఎవరూ వినలేదు అన్నారు'' అంది.

అతడు చప్పున తలెత్తి ''లిండిల్ ' అన్న పేరు నీకెలా తెలుసు'' అన్నాడు. లిండిల్ – కేవలం లక్షాధికారులైన ప్రొఫెషనల్ చిత్రకారులు మాత్రమే వాడే ప్రపంచంలోకెల్లా ఖరీదైన పెయింట్సు.

అతడి ప్రశ్నకు సమాధానంగా నవ్వి, ''నేనూ పెయింటర్నే అనే విషయం మర్చిపోతున్నారు మీరు'' అంది.

''నువ్వూ లిండిల్ పెయింట్స్ వాడతావా?''

''బొమ్మలు బాగా వేసినా వేయకపోయినా మా నాన్నకి డబ్బులు బాగా ఉన్నాయి కదండీ.''

''నేను మామూలు రంగులే వాడతాను. ఇప్పుడు అదికాదు సమస్య. ఈ రంగుల్లో ముఖ్యంగా ఆకుపచ్చ, నారింజ రంగులు ఎఫెక్టివ్‌గా లేవు'' అన్నాడు. ఆమె కేన్వాసు వైపు చూసింది. మామూలు కళ్ళకి తెలీదు అది. నేషనల్ కాంపిటీషన్ దేనికి ప్రథమ బహుమతి ఇవ్వాలా అని సునిశిత దృష్టితో చూస్తే జడ్జికి తెలుస్తుంది.

''పేరుకి రాష్ట్ర రాజధానేగానీ ఇక్కడ ఇంతకన్నా లేవు.''

అతడు కొంచెంసేపు ఆలోచించి, 'ఓ పని చేద్దామా' అన్నాడు. ఏమిటన్నట్టు చూసింది. ''సింథెటిక్ రంగులు కాకుండా మామూలు రంగులు... ప్రకృతిలోంచి తీసి ఉపయోగిద్దాం! చిన్నప్పుడు కొంతకాలం అలా చేసేవాడిని. నేరేడు, పసుపు, గంధంనూనెలాంటి మిశ్రమాల్తో ఆ ఎఫెక్టు సాధించవచ్చు. ఇప్పుడు మనకు కావల్సింది ఆకుపచ్చ కాబట్టి పెద్ద సమస్య ఉండక పోవచ్చు. అయితే ఈ సింథెటిక్ రంగుల్లో ఆ న్యాచురల్ రంగు ఎలా మిళితం అవుతుందో చూడాలి. ప్రయోగం చేద్దాం. గెలిస్తే గెలుస్తాం లేకపోతే వచ్చే నష్టం కూడా ఏమీ లేదు'' అంటూ అతడు తనకి కావల్సిన వస్తువులు చెప్పాడు. ఆమె వెళ్ళి వాటిని తీసుకొచ్చేలోపులో చెట్లమధ్య తిరిగి తనకి కావల్సిన వస్తువులు మరికొన్ని సేకరించాడు. ఆమె రాగానే అన్నీ కలిపి రంగుల మిశ్రమాల్ని తయారు చేయసాగాడు.

ఎప్పుడూ గలగల మాట్లాడేది ఈ సారి అతడు చేసే పనిని నిశ్శబ్దంగా గమనిస్తూ కూర్చుంది. అతడు రకరకాల కాంబినేషన్లు ప్రయత్నిస్తున్నాడు. కొద్దిగా కుదురుతోంది. కేన్వాస్ మీద పెట్టగానే కొద్దిగా రాలిపోతోంది. కొద్దిగా జారిపోతోంది. మళ్ళీ ప్రయత్నం చేస్తున్నాడు. అలా చేస్తూనే, ఆమె చాలాసేపట్నుంచి నిశ్శబ్దంగా ఉండటాన్ని గమనించి ''ఏమిటలా ఉన్నావ్'' అని అడిగాడు.

అతడు చేస్తున్న పని మీద నుంచి కళ్ళు తిప్పలేదు. ఏదో లోకంలో ఉన్నట్టు ''నాకెందుకో ఇది చాలా అద్భుతంగానూ, థ్రిల్లింగ్‌గానూ అనిపిస్తోంది. అజంతా ఎల్లోరాల్లోని చిత్రాలు ఇంతకాలం పాడవకుండా ఉండటానికి కారణం ఇలాంటి లేపనాల మిశ్రమాలే అనుకుంటాను కదూ'' అంది.

''ఇంకా నయం. వాటికీ వీటికీ పోలిక ఎక్కడ? ఇవి నెల రోజులు రంగు కోల్పోకుండా ఉన్నా మనం విజయం సాధించినట్టే'' తైలాన్ని వర్ణంలో మిళితం చేస్తూ అన్నాడు. ''సైప్రస్ చెట్లనుంచి వచ్చే పాలలో కూడా ఒక విశేషం ఉంది గమనించావా? దీని నుంచి వచ్చిన పాలు నిముషాల్లో నారింజరంగుని సంతరించుకుంటాయి.''

''మనం హిమాలయాల్లోనే ఉన్నాం కదూ'' ఏదో గుర్తొచ్చినట్టు అడిగింది.

''ఏం? అందుకేమైనా అనుమానమా?''

''అహ. ఏం లేదు. మనుచరిత్రలో వరూధిని ప్రవరుడితో '...కప్పుర పుసిరము గొజ్జంగ పూపాదల్ గురియంగ' అని ఒకచోట అంటుంది. వర్షపు నీరు కర్పూరపు చెట్లు మీద నుంచి పడి, ఆ పన్నీరు స్ఫటికపు రాతి నేలల దొనల్లో నిలువ చేరి ఎర్రచందనపు రంగుని సంతరించుకుంటుందని. 'దివిజ తరుజములు' అంటే ఈ సైప్రస్ చెట్లేనేమో. ఆకాశాన్ని తాకుతున్నాయిగా''

''మైగాడ్. నిజమే అయ్యుండవచ్చు. దానికేం గానీ, నువ్వేమిటి ఒకవైపు *దిల్ హై కె మాన్‌తా నహీ* అని పాడతావు. మరోవైపు మనుచరిత్ర గొప్ప చెపుతావు.''

ఆమె దానికి సమాధానం చెప్పకుండా, ''మిమ్మల్ని ఆదిమానవుల్తో పోల్చినందుకు అప్పుడు కొద్దిగా ఫీలయ్యాను. ఇప్పుడు కరెక్టుగా సరిపోయింది ఈ రంగులు కలపటం. ఆది మానవులు మసాలాలు ఇలాగే నూరేవారనుకుంటా'' అంది నవ్వుతూ.

అతడు కుంచెతో ఆకుపచ్చరంగు అద్ది అయిదు నిముషాలు ఆగాడు. రంగు మారలేదు. అతడి మొహంలో పెద్ద సంతృప్తి కూడా కనపడలేదు.

ఆమె ఉత్సాహంగా అతడి వైపు చూస్తూ 'ఏమైంది' అని అడిగింది.

''ఫర్వాలేదు. మొత్తం బొమ్మలో ఆకుపచ్చ ఎక్కువగా చోటు చేసుకోలేదు కాబట్టి ఇది అంత పెద్ద సమస్య కాదు. ఇప్పుడే అసలు సమస్య వస్తోంది. మొత్తం ఆకాశాన్నీ సంధ్యా సమయపు కెంపువర్ణాన్నీ చిత్రీకరించాలి. మన విజయం దాని మీద ఆధారపడి ఉంటుంది.''

''దివిజ తరుజ చీల్చి, కమల బాంధవునడిగి రక్తవర్ణము తెచ్చి, చందనము కూర్చి' అన్నాడుగా అల్లసాని పెద్దన. ఆకాశాన్నుంచి చెట్లు పుట్టినట్లు ఆయన తప్ప ఇంకెవరు వర్ణించగలరు? చూద్దాం మరి ఆయన చిత్రీకరణ ఎంత కరెక్టో...'' అంటూ వెళ్ళి సైప్రస్ చెట్ల పాలు పట్టుకు వచ్చింది.

అందులో తైలాన్ని కలిపిప్రయత్నం చేశాడు. క్షణాలు మారేకొద్దీ అదికూడా రంగు మార్చుకొని ఒక వర్ణంలో స్థిరమై పోయింది. అనుకున్న ఫలితం రావటం లేదు.

సూర్యుడు నడినెత్తి మీదకొచ్చాడు. క్రితం రోజు తాలూకు మంచు తుఫాను ప్రభావం ఈ రోజు తెలుస్తోంది. ఒకవైపు చలి, మరొక వైపు ఎండ.

అతడి నిస్సహాయస్థితిని ఆమె గమనిస్తోంది. ఎవరిమీదో తెలియని కసి, ఉక్రోషంతో ఆమె కళ్ళలో నీరు గిర్రున తిరిగింది. అతడు జీవితాన్ని చూసినవాడు. కోపము, దుఃఖములాటి వాటికి అతీతుడు. ఇంకా ప్రయత్నిస్తూనే ఉన్నాడు. కానీ ఆమె చిన్నపిల్ల. ఈ ఓటమి తట్టుకోలేక పోతోంది. అతడు –చలికి కొంకర్లుపోయిన వేళ్ళు స్వాధీనంలోకి తెచ్చుకుని ఎంత కష్టపడి ఆ బొమ్మ వేయటానికి ప్రయత్నిస్తున్నాడో ఆమెకు తెలుస్తోంది. ఇంత వరకూ వచ్చాక ఫెయిలవటం – ఆమెకి ఆ కొండల్నీ, చెట్లనీ కాల్తో తన్నాలన్నంత కసిగా అనిపిస్తోంది.

సమయం రెండవుతోంది. టీ త్రాగాలన్న ఉత్సాహం కూడా లేదు. నాలుగింటిలోపు చిత్రాన్ని తీసుకువెళ్ళి ఇచ్చెయ్యాలి. అతడు కుంచె పక్కనపెట్టి వెళ్ళి అలసటగా రాతిమీద కూర్చుని మొహాన్ని చేతులమధ్య దాచుకున్నాడు. అతడి బాధ తనకి తెలియనివ్వకుండా ఉండటానికి, అతడు చేస్తున్న ప్రయత్నం ఆమెని మరింత బాధకు గురిచేస్తోంది.

రోషంగా చెట్లవైపూ, ఆకాశంవైపూ, కొండలవైపూ చూసింది. సూర్యుడు మేఘాల చాటుకి వెళ్ళగానే మంచు మీద ఆకాశపు రంగు రిఫ్లెక్టయి నారింజ వర్ణంలోకి మారింది. 'నాకు కావలసిన వర్ణం ఇదే' అన్నట్టు ప్రకృతి సందేశాన్ని ఇచ్చింది.

అతడు ఇలా ఎంతసేపు కూర్చున్నాడో తెలీదు. ''ఇది ప్రయత్నించండి'' అన్న మాటలకి కళ్ళు విప్పాడు. ఈసారి ఆమె కాస్త ముదురు రంగు వర్ణాన్ని తీసుకొచ్చింది. వంద సంవత్సరాల క్రితం వృక్షం తాలూకుదన్నట్టు ఉంది అది.

అతడు నిరాసక్తంగానే దానితో ప్రయత్నించాడు. 'బేస్'గా కావాల్సిన తైలాన్ని కూడా కలపలేదు. క్షణాలు గడిచాయి. నిముషాల్లోకి మారేయి. క్రమంగా రంగు మారి అది జేగురు రంగులో స్థిరపడింది. ఆమె ఉత్సుకంగా అతని వైపు చూసింది. అతడి మొహంలో ఎప్పుడూ లేని ఒక కొత్త సంచలనం. ఉద్వేగం. బంగారపు గనుల్ని అన్వేషించే వాళ్ళకి మట్టిలో ఆ ఛాయలు కనబడగానే, కళ్ళు ఆనందంతో ఎలా మెరుస్తాయో – ఎలా తొందరపడతాయో... అలా...

అతడు గబగబా మిగతావి కలిపాడు. మొదటి గీత కుంచెతో అలవోకగా గీశాడు.

ఆమె గుండె కొట్టుకోవడం ఆమెకే తెలుస్తోంది. గాలి కూడా నిలబడి చూస్తోంది.

తెలుపు ఎరుపుల మిశ్రమంనుంచి – గులాబిరంగు చారలు క్రమంగా జేగురు రంగుల్లోకి విశ్లేషణమై – నదిలో అలల్లా – కొన్ని మారి – కొన్ని మారక – అక్వేరియంలో చేపపిల్లల్లా తళతళలాడుతూ – చివరకు బంగారు వర్ణంలో స్థిరపడితే – ఆ మెరుపు అతడి కళ్ళల్లో కూడా కనపడితే – ఆమె చేతులు రెండూ గాలిలో సాచి చిన్నపిల్లలా ఎగిరి గంతేస్తే – ఆ అల్లరికి సెలయేరు ఈర్ష్య పడింది. పర్వతాలు పెద్దమనిషి తరహాగా ఆ మెచ్చుకోలుని తమ 'గాంభీర్యం' వెనక

దాచుకున్నాయి. సైప్రస్ చెట్లు ఆనందిస్తున్నట్టు తలూపాయి. మంచు కరిగి కాళ్ళను తడిపింది. ఆనందం కరిగి కంటి అంచుని తడిపింది.

అతడు ఆగలేదు. అతడి చేతిలో కుంచె గుర్రమై కదను తొక్కింది. బొమ్మ భాగాన్ని మొత్తం ఆ అస్తమిస్తూన్న సూర్యుడి రంగుతో నింపాలి. అతడు ఆ పనిలో నిమగ్నమై ఉండగా ఆమె వెళ్ళి చెట్ల నుంచి పాలని తెచ్చేది. ఆమె పనే కష్టం. అంతా ఒకేసారి తేవటానికి వీల్లేదు. వెంటనే రంగు మారిపోతుంది. అందుకని అలసటని పెదాలమధ్య బిగపట్టి ఆమె పరుగు పరుగున వెళ్ళి తెస్తోంది. అతడయితే అసలు ఈ ప్రపంచంలోనే లేడు. ఆఖరి భాగం పూర్తిచేస్తూ ఉండగా ఆమె రాక ఆలస్యమై– అతడీ ప్రపంచంలోకి వచ్చాడు. కొంచెం సేపుండి – మరికొంచెంసేపు వేచి – ఆమె కోసం వెతుక్కుంటూ చెట్ల వెనక్కి వెళ్లాడు. అక్కడి దృశ్యం చూసి నిర్విణ్ణుడయ్యాడు.

వంద సంవత్సరాల చెట్టూ లేదు. అది దూరంగా కొండల మీదా లేదు. సైప్రస్ చెట్ల తెల్లటి పాలని అస్తమిస్తున్న సూర్యుడి ఎర్రటి ఆకాశపు వర్ణంలోకి మార్చటం కోసం... ఆకాశమంత కేన్వాస్‌ని అంతులేనంత రంగులో నింపటం కోసం...

మొదట వేలిని సూదితో గుచ్చుకుని, అది చాలక అరచేతినీ చీల్చుకుని... అక్కడ కూడా రక్తం గడ్డకట్టి, ఏం చేయాలో తోచక, మరొకవైపు టైమ్ అయిపోతోందేమో అన్న ఆత్రంతో– నాళాల్లోంచి మిగులు రక్తాన్ని పిండటం కోసం తెగిన చేతిని రెండో చేత్తో వత్తుతూ, ఆ బాధని పెదాల మధ్య బిగపట్టి – ఆ తొందర్లో.. కంగార్లో... వెనుకనుంచి అలికిడి వినిపించి, బెదిరి అటుచూసి – అక్కడ కార్తికేయని చూసి చేతిని వెనుక దాచేసుకుని ఆమె 'ఏమీ లేద'న్నట్టు నవ్వినప్పుడు. 'అసలే ఆనదు చూపు. ఆపై కన్నీరొకటి' అన్న శబరి నిస్సహాయ వేదనో — 'నీ కాలు సోకి రాయి ఆడది అయినాదంట, నా పడవపై కాలిడితే ఏమోస్తదో తంటా' అన్న గుహుడి భావోద్వేగమో... ఉడుత వెన్ను గీతల మధ్య కృతజ్ఞతో... కదిలి కన్నీటి చుక్కై జారింది.

హృదయానికి కన్నులుంటే ఆ దుఃఖం అగోచరం. హృదయానికి చేతులుంటే ఆ ఆలింగనం అలౌకికం. ఒకటి దుఃఖం, ఒకటి ఆనందం. ఆ రెండూ కలిసిన స్థితిలో ఆమె తల మీద చేయివేసి కన్నులు మూసుకున్నాడు. కదిలే వ్రేళ్ళు కృతజ్ఞత చూపుతోంటే, కదిలే కాలం కూడా ఆగిపోయింది.

అతడు ఇంకొక్క గీత కూడా గీయననీ, బహుమతి వస్తే వస్తుంది... లేకపోతే లేదని కేన్వాసూ మిగతా సామగ్రి తీసుకుని వచ్చేస్తూంటే అడిగింది... ''ఎందుకు మిత్రాజీ – మీకంత పంతం?''

''నాకిది ఏమీ బావోలేదు అనూజ్ఞా.''

''నాకు బావుంది. ఇంటర్వెల్‌కి ఇంత కన్నా గొప్ప సినిమాటిక్ సీక్వెన్సు మరొకటి ఉండదు. మా రాజేష్‌కి తెలిస్తే మాత్రం నాకోసం చిందించవలసిన రక్తాన్ని మీ మిత్రాజీ కోసం ధారపోస్తావా'' అని తిడతాడు.

ఆ మాటలకి కార్తికేయ నవ్వి ''మీ రాజేష్ చాలా అదృష్టవంతుడు'' అన్నాడు.

‘‘హమ్మయ్యా. మీ మొహంలోకి కాస్త ప్రసన్నత వచ్చింది కదా ఇప్పుడు చెప్పండి. మా రాజేష్ ఎందుకు అదృష్టవంతుడు?’’

‘‘ప్రతి రెండు నిముషాలకి భార్యచేత తల్చుకో బడుతున్నాడు కాబట్టి.’’

‘‘మరి ఈ ప్రపంచంలో దురదృష్టవంతుడెవరు? అది చెప్పండి.’’

అతడు సాలోచనగా అన్నాడు. ‘‘భార్యకి గౌరవం ఇవ్వలేనివాడు, అమితమైన ఆనందంలోనూ అంతులేని దుఃఖంలోనూ భార్యను తల్చుకోనివాడు, పనిలోనూ వ్యసనంలోనూ పడి భార్యని నిర్లక్ష్యం చేసేవాడు ఈ ప్రపంచంలోకెల్లా దురదృష్టవంతుడు.’’

## 2

**రాష్ట్ర గవర్నర్** మాట్లాడుతున్నాడు. హాలు ముప్పాతిక భాగం నిండి ఉంది. నిశ్శబ్దం నటిస్తూ వింటున్నారు ప్రేక్షకులు. ‘మనుష్యుల ప్రవర్తన మీద ‘కళ’ ప్రభావం’ అన్న అంశం మీద మొదలుపెట్టి, ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం చౌకబియ్యం పథకాన్ని ఎలా అమలు చేస్తున్నదీ వివరిస్తున్నాడు అధికార పార్టీ ప్రాపకం ద్వారా పదవిలోకి వచ్చిన గవర్నర్!

కార్తికేయ, మిగతా చాలామంది ఆర్టిస్టులు హాలుకి దూరంగా చెట్ల క్రింద నిలబడి మాట్లాడుకుంటున్నారు. నిజమైన కళాకారులకి రాజకీయాలూ, ఉపన్యాసాలూ, సభలూ పెద్దగా ఉత్సాహాన్ని కలిగించవు. వాళ్ళకి స్ఫూర్తి కలిగించేవి అయితే తప్ప ప్రేక్షకుడిగా ఇమడలేరు.

తోటి కళాకారుల్ని కలుసుకోవటం కోసమే ఇంతదూరం వచ్చాడు కార్తికేయ. ఆ ఉత్సాహం మాటల్లో వర్ణించలేనిది. పదిమంది ఆర్టిస్టులు కలిసే ప్రదేశం చిన్నపిల్లల క్రచ్ లాంటిది. వాళ్ళ ప్రపంచం బయటవాళ్ళకు అర్థంకాదు.

‘‘మిమ్మల్ని హోటల్ రూమ్‌లోంచి బయటకు పంపించినందుకు మేము చాలా బాధపడ్డాం. మీరు గొప్ప ఆర్టిస్టులు. మీ బొమ్మ చూసి మాకు మతిపోయింది’’ అన్నాడు గోవింద్. కార్తికేయ నవ్వి ఊరుకున్నాడు.

‘‘పాపం అనూజ్ఞ పందెం ఓడిపోయింది.’’

కార్తికేయ ఆశ్చర్యంగా ‘‘పందెం ఏమిటి?’’ అన్నాడు.

‘‘మిమ్మల్ని రూమ్ ఖాళీ చేయిస్తే తనేం అడిగితే అది మేము ఇవ్వాలని పందెం కట్టింది. పందెం నెగ్గి మా జేబులు ఖాళీ చేయించింది. కానీ తరువాత ఓడిపోయిందిగా! ఇప్పుడు మా వాళ్ళు మంచి కసిమీద ఉన్నారు. తనని చాలా ఇబ్బంది పెట్టేసి తను చేయలేనిది అడిగితీరాలని నిశ్చయించుకున్నారు.’’

‘‘ఏమిటది?’’ వాళ్ళ సంభాషణ హిందీలో జరుగుతోంది.

గోవింద్ ఏదో చెప్పబోతోంటే గవర్నరు ఉపన్యాసం ముగిసినట్టు ఆడిటోరియం లోపల్నుంచి చప్పట్లు వినిపించాయి. ఇద్దరూ అటు చూశారు. ‘‘రండి వెళ్దాం. ప్రైజులు అనౌన్స్ చేస్తున్నారు’’ అన్నాడు గోవింద్. అటువైపు నడుస్తూండగా, ‘‘మీకీ

బహుమతుల మీద పెద్ద ఉత్సాహం ఉన్నట్టు లేదే'' అన్నాడు. కార్తికేయ నవ్వి ఊరుకున్నాడు. ''మీరు ఎక్కువ మాట్లాడరనుకుంటాను.''

''అలా ఏం లేదు. బహుమతి కన్నా ఎక్కువగా, అందర్నీ కలుసుకుందామని వచ్చాను.''

''మీకు తెలుసా? అనూజ్ఞ కూడా పెయింటరే.''

''చెప్పింది! పాపం ఆవిడది చాలా విషాదకరమైన కథ కదూ.''

నడుస్తున్నవాడల్లా ఆగి ''విషాదకరమైన కథేమిటి?'' అని అడిగాడు గోవింద్.

''అదే దొంగలు ఆమె భర్త చెయ్యి నరకటం'' అంటూ చెప్పాడు కార్తికేయ.

సగం నుంచే నవ్వటం మొదలు పెట్టి అతి కష్టం మీద ఆపుకున్నాడు గోవింద్ గోపాల్. కార్తికేయ అతడివైపు చిత్రంగా చూశాడు. విపరీతంగా నవ్వటం వల్ల వచ్చిన కన్నీళ్ళను తుడుచుకుంటూ ''ఏమిటి కార్తికేయజీ... షోలే సినిమానా? పదహారో ఏట పెళ్ళా? చంబల్‌లో చెయ్యి నరికారా? క్రిందపడితే అబార్షన్ అయిందా? మొగుడు తీహార్ జైల్లో ఉన్నాడా? పొయ్యిలో కట్టె తీసి దొంగనెత్తిన కొడ్తే కర్ర విరిగిందా?'' అని గోపాల్ మళ్ళీ నవ్వసాగాడు.

కార్తికేయ మాట్లాడలేదు. ''మా అనూజ్ఞ కోతి గురూజీ. చెప్పిన అబద్ధం చెప్పకుండా చెపుతుంది. మీరు కూడా పాపం ఆ ట్రాప్‌లో పడిపోయారన్నమాట. తప్పదులెండి. మొహంలో ఎంత సిన్సియారిటీ కనిపిస్తుందంటే ఎవరికైనా నమ్మక తప్పదు.''

ఇద్దరూ ఆడిటోరియంలోకి ప్రవేశించారు. ముందు వరసలో కూర్చున్న అనూజ్ఞ వెనక్కి తిరిగి చెయ్యి ఊపింది. గోపాల్ కూడా చెయ్యి ఊపాడు. సీట్లలో కూర్చుంటూ ఉండగా, ''గురూజీ, ఫూల్ అయినందుకు బాధపడుతున్నారా?'' అడిగాడు.

''లేదు. రేపు ఢిల్లీ వెళ్ళాక మీరు కాలేజీలో చెప్పుకుని నవ్వుకోవటానికి సరదాగా ఉంటుందిగా. ఈ ప్రాక్టికల్ జోకుని నేనూ ఎంజాయ్ చేస్తున్నా.''

గోవింద్‌కి నవ్వొచ్చింది. దెబ్బతిన్న గురుడు దాన్ని కప్పి పుచ్చుకోవటానికి అంతకన్నా ఇంకేం అంటాడులే అనుకున్నాడు.

ఇంతలో ప్రధాన జడ్జి వచ్చి కవర్ విప్పాడు. అప్పటివరకూ ఉన్న కొద్దిపాటి గుసగుసలు కూడా మాయమై ఆడిటోరియంలో సూదిపడితే వినపడేంత నిశ్శబ్దం వ్యాపించింది. బహుమతుల వివరాలు జడ్జి చదవసాగాడు. ''మొదటి బహుమతి''... సినిమాటిక్ సస్పెన్స్ కోసం ఒక్కక్షణం ఆగి ''...రమ్యస్మృతి... పెయింట్ బై గీతాంజలి... పెన్‌నేమ్... కుమారి అనూజ్ఞ'' అన్నాడు. ఆడిటోరియంలో కరతాళ ధ్వనులు.

అనూజ్ఞ కుర్చీలోంచి లేచింది. ఆమెను చూడగానే మరొకసారి హాలు దద్దరిల్లేలా చప్పట్లతో నిండింది. అయితే ఈసారి సగం మంది ఆమె అందానికి ముగ్ధులై చప్పట్లు కొట్టారు.

కార్తికేయకి ఇదేమీ పట్టలేదు. రెండో బహుమతి ఎవరిదని కూడా పట్టించుకోకుండా అతడు ఆడిటోరియం నుంచి బయటకు నడిచి పక్కనే ఉన్న హాల్లోకి వెళ్ళాడు. ప్రదర్శన నిమిత్తం పెట్టిన బొమ్మలు అక్కడ ఉన్నాయి. అన్ని బొమ్మల్నీ అతడు అంతకు ముందే చూశాడు. అయితే తెలియక ముందు చూడటం వేరు. తెలిసిన తరువాత చూడటం వేరు. 'గీతాంజలి' అన్న పేరు మీద అనూజ్ఞ ఆ పోటీలో పాల్గొన్నదని అతడికి అప్పటి వరకూ తెలీదు.

సగం మూసుకుపోతున్న రెండు అందమైన కళ్ళు. వాటిమీద అలవోకగా ఒక వల... క్రింద చిన్న అక్షరాల్తో 'రమ్యస్మృతి' అని వ్రాసి ఉంది. మరో మూల 'గీతాంజలి' అని పెయింటర్ పేరు ఉంది. బొమ్మ గీయటంలో ప్రజ్ఞత లేదు. కృషి ఉంది! జాతీయ పోటీ స్థాయి లే...దు కానీ అమాయకమైన లాలిత్యం ఉంది. భావం బావుంది. గీయటం గొప్పగా లేదు.

బహుమతుల ప్రకటన మధ్య కార్తికేయ బయటకు రావటంతో గోవింద్ గోపాల్ కూడా అతడిని అనుసరించి వచ్చాడు. తనకు బహుమతి రానందుకు ఉక్రోషంతో కార్తికేయ అలా వచ్చేశాడనుకున్నాడు కానీ అతడు హాల్లోకి వెళ్ళి అనూజ్ఞ బొమ్మ ముందు నిల్చుని, అందులో లీనమై చూస్తుంటే గోపాల్‌కి అర్థం కాలేదు.

''బొమ్మ బావోలేదా?'' ఓరగా చూస్తూ కాస్త వెటకారంగా అన్నాడు.

''బావోలేకపోవటం ఏమిటి? ఆ అమ్మాయి అల్లరి చూస్తే ఆమెలో ఇంత ఆర్టు ఉందని ఎవరూ అనుకోరు. ఆ కళ్ళు చూశావా ఎంత బావున్నాయో. నీకు హిందీలో అర్థమయ్యేలా చెప్పటం నాకు చేత కాదు కానీ, తెలుగులో అయితే ఆ కుంచె గీతల్ని కవిత్వంలోకి అనువదించి చెప్పేవాడిని.''

గోవింద్ స్తబ్ధుడై కార్తికేయ వైపు చూశాడు. అతడికి ఒక్క విషయం స్పష్టంగా అర్థమైంది. బహుమతి రాలేదని తెలియగానే కార్తికేయ వడివడిగా బయటకొచ్చింది తనకు రాలేదన్న ఉక్రోషంతో కాదు. తన స్నేహితురాలు ఏం వేసిందో చూద్దామని..! ఆ ఉత్సాహంలో, రెండో బహుమతి తనకి వచ్చిందా లేదా అని కూడా పట్టించుకోలేదు. పైగా ఆ చిత్రపు అందాన్నీ, అర్థాన్నీ తనకు వివరిస్తానంటున్నాడు. గ్రేట్..!

ఆ యూనివర్శిటీ కుర్రాడి కళ్ళల్లో అప్రయత్నంగా నీళ్ళు తిరిగాయి. అనూజ్ఞ కల్పిత కథ చెప్పి ఫూల్‌ని చేసినప్పుడు కూడా, ''మీరు కాలేజీల్లో చెప్పుకుని నవ్వుకోవటానికి సరదాగా ఉంటుంది'' అన్న కార్తికేయ మాటల్లో శ్లేషలేదనీ, 'నా మీద వేసే జోకు మీకు ఆనందాన్నిస్తే ఆ జోకు నాకూ ఆనందమే'' అన్న భావం మాత్రమే ఉందనీ అర్థమై, ఆర్ద్రమైన తన ఫీలింగు కనపడకుండా మొహం బొమ్మ వైపు తిప్పుకుని ''గురూజీ ఈ బొమ్మకి అర్థం'' అన్నాడు.

కార్తికేయ ఇంకా ఆ బొమ్మవంకే చూస్తూ, ‘‘స్మృతి ఎప్పుడు రమ్యమవుతుంది గోపాల్? జీవన యానంలో మనతోపాటు పయనించి, రకరకాల అనుభవాల్ని మనతో పంచుకుంటేనే కదా ఆ ఎడబాటు స్మృతిగా మిగిలిపోతుంది. దానికి సింబాలిక్‌గా ఆ కళ్ళు...’’ అంటూ కాళ్ళ ప్రసక్తి రాగానే అతడు ఆలోచనల్లోకి జారిపోయాడు.

*మంగళసూత్రం కడుతున్నప్పుడు తలవంచుకునే నెపంతో క్రిందికి దిగిన అల్లరి కళ్ళు... నేల చూపులు చూస్తూ ‘ఇక నీ మీద గెంతులేయటం కుదరదులే’ అని భూదేవితో మాట్లాడిన చిలిపి కళ్ళు... తొలిరాత్రి గుండె అల్మైరాలోంచి మౌనాక్షరాల పుస్తకాన్ని తెరచి రసరమ్య పుటల్ని చదివి; చదివించి అలసిపోయిన మత్తు కళ్ళు. పగళ్ళు కరుణ కౌగిళ్ళు. రాత్రిళ్ళు కోర్కెకి కొనవ్రేళ్ళు. నా వంశం కోసం, నా పిల్లలకు తల్లై ఆర్ధ్ర సంగీత శృతిలో మాతృ స్వప్నాలను నాకు వినిపిస్తూ సొలసిపోయిన పురుటి కళ్ళు... కూతుర్ని అత్తవారింటికి పంపిస్తూ తలుపు చాటున చెమ్మగిల్లిన తడికళ్ళు... పరాయి ఊళ్ళో చదువుకునే కొడుకు కోసం చేటలో బియ్యం ఏరుతూ పరధ్యానించే గాజు కళ్ళు... ఆ కళ్ళు... నా గుళ్ళో దేవుళ్ళు. భక్తి నిండిన దోసిళ్ళు. నా గుండె గుప్పెట్లో ప్రేమ భిక్ష వేసే పిడికిళ్ళు. నన్నాశీర్వదించే ఉపనిషద్వారపు వాకిళ్ళు. ఆ కళ్ళు వెన్నెల పందిట్లో అత్తరు దీపాలు. మగవాడికి మాత్రమే స్వంతమైన స్వప్న సుగంధ మందిరాలు. ఒక్కోసారి ఆ కళ్ళు – నా స్వార్థం గూడులో బెదిరిన పావురాళ్ళు.* వసంతంలో నా చలి నెగళ్ళు, గ్రీష్మంలో నా లేత మామిడి చివుళ్ళు!

అలాటి కళ్ళు శాశ్వతంగా మూసుకుపోతే  అనుభవం స్మృతి గా మారుతుంది. కార్తికేయ ఆలోచనల నుంచి తేరుకుని ‘‘ఆ కింది ‘వల’ ఉన్నది చూశావా గోపాల్. అది సంతోషాన్ని లాక్కు వెళ్ళే మృత్యువు. అందుకే అది రమ్యస్మృతి అయింది’’ అన్నాడు.

గోపాల్ ఆశ్చర్యంతో కొంతసేపు మాట్లాడాక, చివరికి అన్నాడు. ‘‘మిమ్మల్ని చేసుకోబోయే అమ్మాయి ఎవరో చాలా అదృష్టవంతురాలు.’’

‘‘నాకు వివాహం కాలేదని ఎందుకనుకున్నావ్? నా భార్య పేరు శ్రీకళ్యాణి.’’

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments